క్లుప్తంగా

ఉపాధి కూలీలకు వేతనం పెంచాలి



ఫిరంగిపురం: ఉపాధి కూలీల వేతనం రోజుకు రూ.600 పెంచాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు అన్నారు. మండలంలోని గుండాలపాడు, బేతపూడి గ్రామాల్లో బుధవారం ఉపాధి కూలీలు పనిచేస్తున్న ప్రదేశాన్ని ఆయన పరిశీలించారు. కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. దేశవ్యాప్తంగా 20న కార్మిక సంఘాల పిలుపు మేరకు నిర్వహించే సమ్మెను జయప్రదం చేయాలని అన్నారు. ఉపాధి కూలీలు అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పనుల సమయంలో గాయాలపాలైన, మరణించినా వారికి నష్టపరిహారం చెల్లించాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి షేక్.మస్తాన్‌వలి, రైతు సంఘం నాయకులు జి.వెంకటేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు నాగరాజులు పాల్గొన్నారు.

ఖురేషిపై వివాదాస్పద వ్యాఖ్యలు తగవు

దుగ్గిరాల: ఆర్మీ కల్నల్ సోఫియా ఖురేషిపై వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం తగదని భారత ప్రజాస్వామ్య లౌకిక రాజ్యాంగ పరిరక్షణ సమితి అధ్యక్షులు షేక్.సుభాని అన్నారు. దుగ్గిరాలలో బుధవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ ఖురేషిని పరోక్షంగా ఉగ్రవాదుల సోదరిగా చూపుతూ ఎంపీ, బీజేపీ మంత్రి విజయ్ షా కించపరిచే వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. దేశం కోసం ప్రాణాలకు తెగించి ఖురేషి చేస్తున్న సేవలను కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ కొనియాడుతున్నారని అన్నారు. విజయ్ షా తాను చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు వెనక్కి తీసుకుని ఆమెకు క్షమాపణలు చెప్పాలని సుభాని డిమండ్ చేశారు.

వేసవి శిక్షణ శిబిరం ముగింపు సభ నేడు

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం, అమరావతి ఐకాన్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరం ముగింపు సభను గురువారం నిర్వహిస్తున్నట్లు బాలోత్సవం కోశాధికారి గాదె సుబ్బారెడ్డి, అమరావతి ఐకాన్ అధ్యక్షులు వినోద్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం జరిగిగే ఈ ముగింపు కార్యక్రమానికి రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి ప్రముఖులు పాల్గొంటారని అన్నారు. ఈ శిబిరంలో చిన్నారులు నేర్చుకున్న వివిధ రకాల నృత్యాలను ప్రదర్శిస్తారని వారు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

17 నుంచి వైభవంగా చండీహోమం

దుగ్గిరాల: మండలంలోని కంఠంరాజు కొండూరు గ్రామంలో కొలువైయున్న శ్రీ మహంకాళీ అమ్మవారి దేవస్థానంలో 48వ పునఃప్రతిష్ట వార్షికోత్సవం జరగనుందని నిర్వాహకులు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారిని విశేషంగా అలంకరించారు. 17వ తేదీ నుంచి 21వ తేదీ వరకు వార్షికోత్సవం సందర్భంగా దేవస్థానంలో చండీహోమం నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కార్యనిర్వాహణ అధికారి కె.సునీల్‌కుమార్ కోరారు.

సిద్ధి వినాయకుడికి విశేష పూజలు



ఫిరంగిపురం: మండలంలోని వేములూరిపాడు గ్రామంలో కొలువైయున్న జలపాలేశ్వస్వామి సన్నిధిలోని సిద్ధి వినాయకుడికి బుధవారం అర్చకులు ఉమాపతిశాస్త్రి విశేష పూజలు చేశారు. ఉదయాన్నే స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు చేసి నూతన వస్త్రాలతో అలంకరించారు. గరిక, పూలు, అష్టోత్తర, సహస్రనామ పూజలు చేశారు. పూజల్లో పాల్గొన్న భక్తులకు అర్చకస్వాములు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు



దుగ్గిరాల: ఎక్కడ పడితే అక్కడ.. ఎంత కావాలంటే అంత.. మట్టి, ఇసుకను ఇష్టానుసారంగా తవ్వేస్తున్నారు. దుగ్గిరాల మండలం పేరుకలపూడి గ్రామంలోని స్థానికుల వివరాలు ప్రకారం.. మెట్ట పొలంలో 1.5 మీటర్ల లోతులో రాత్రిళ్లు మిషన్‌లతో మట్టి తవ్వి ట్రాక్టర్‌లతో తరలిస్తున్నారు. బుధవారం అనుమతి లేకుండా మట్టి తరలిస్తున్నారన్న సమాచారంతో గ్రామ రెవెన్యూ అధికారి కె.జాన్సన్ గ్రామ సర్పంచ్ జి.గంగాధర్ యాదవ్ సాయంత్రం పరిశీలించారు. వరుసగా చట్టవిరుద్ధంగా తవ్వేస్తున్న సంఘటనలపై జిల్లా పంచాయతీరాజ్ అధికారులు, పంచాయతీరాజ్ కమిషనర్ దృష్టికి సమస్యను తీసుకువెళ్లాలని గంగాధర్ వీఆర్‌వోకి విజ్ఞప్తి చేశారు.

జగనన్న కాలనీలో కనీస సౌకర్యాలు కరువు!

- కాలనీలో మౌలిక సదుపాయాలు లేక అవస్థలు
- రాత్రి సమయంలో వీధి లైట్లు లేక ఇబ్బందులు
- రోడ్లు, మంచినీటి సౌకర్యం, మురుగునీటి వ్యవస్థ కనిపించని వైనం



రహదారులు లేక, పిచ్చి మొక్కలతో దర్శనమిస్తున్న జగనన్న కాలనీ

దుగ్గిరాల: కులమతాలకు తావులేకుండా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదవారి సొంతింటి కలను నెరవేర్చింది. అర్హులైన లబ్ధిదారులను గుర్తించి ఎందరో నిరుపేదల సొంతింటి కలకు సాకారం చుట్టింది. ఆలస్యం లేకుండా స్థలం పంపిణీ.. పక్కా ఇల్లు నిర్మించుకోడానికి తోడ్పాటు అందించింది. దుగ్గిరాల మండలంలోని 18 గ్రామాల్లో 14 జగనన్న లేఅవుట్‌లు ఏర్పాటు చేసి 2,527 మందికి ఇంటి పట్టా అందించి, రిజిస్ట్రేషన్ చేయించడంతో పాటు 10 సంవత్సరాల అనంతరం పూర్తి హక్కులు కల్పించారు.

కాలనీలో సమస్యల తిష్ట..

గత వైఎస్సార్‌సీపీ పేదలకు కల్పించిన జగనన్న కాలనీలో సమస్యలు తిష్ట వేశాయి. కనీస మౌలిక సదుపాయాలు లేకపోవడంతో కాలనీలోని ప్రజలు తీవ్ర ఇబ్బందుల పడుతున్నారు. రోడ్లు, మంచినీటి సౌకర్యం, మురుగు నీటి సౌకర్యం, వీధి దీపాలు లేక అవస్థలు పడుతున్నారు. మోరంపూడిలోని జగనన్న కాలనీలో పిచ్చి మొక్కలు దట్టంగా పెరిగి విషపురుగులకు నివాసాలుగా మారాయి. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది కావొస్తున్నా కనీసం సమస్యలు వినడానికి, ఫిర్యాదులను అందుకోవడానికి అధికారులు, నాయకులు ఎవరూ ముందుకు రావడంలేదని ప్రజలు వాపోతున్నారు.

అధికారులు స్పందించాలి..

జగనన్న కాలనీలో సీసీ లేదా తారు రోడ్లు, పక్కా డ్రైన్ నిర్మాణం, నిరంతర నాణ్యమైన తాగునీటి సరఫరా కోసం ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణాలు చేపట్టాలని ప్రజలు వాపోతున్నారు. పిచ్చిమొక్కలు తొలగించి వీధి దీపాలు ఏర్పాటు చేస్తే తమ సమస్యలు తొలగిపోతాయని కాలనీ వాసులు వేడుకుంటున్నారు. వారి సమస్యల పరిష్కారం కోసం అధికారులు సకాలంలో స్పందించాలని కోరుకుంటున్నారు.



రాత్రి వేళ అంధకారాన్ని తలపిస్తున్న జగనన్న కాలనీ

మూడేళ్లుగా ఉంటున్నాం..



జగనన్న కాలనీలో మూడేళ్లుగా ఉంటున్నాం. కాలనీలోకి రావాలంటే మట్టి రోడ్డే దిక్కు. వర్షం పడితే నానా అవస్థలు పడుతున్నాం. రాత్రి సమయంలో కాలనీ అంధకారాన్ని తలపిస్తుంది. వీధి దీపాలు ఏర్పాటు చేయాలి.

– జి.మహేష్, జగనన్న కాలనీ, మోరంపూడి

సమస్యలు పరిష్కరించాలి..



ప్రతి నెలా ఇచ్చే పింఛను మా కాలనీలో ఇవ్వడం లేదు. ఆఫీసుకు వచ్చి తీసుకోమ్మని అధికారులు చెబుతున్నారు. రేషన్ ఇచ్చే బండి కూడా రోడ్లు సరిగా లేని కారణంగా కాలనీలోకి రావడం లేదు. కాలనీలోని సమస్యలు పరిష్కరించాలి.

–ఎం.పుష్పలత, జగనన్న కాలనీ, దుగ్గిరాల

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న రవి



పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడుతున్న పల్లె కృష్ణ

తాడేపల్లి రూరల్: రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా 20న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సి.ఐ.టి.యు రాజధాని డివిజన్ అధ్యక్షులు ఎం.రవి పిలుపునిచ్చారు. బుధవారం ఎంటీఎంసీ పరిధిలోని ఉండవల్లిలో ప్రజాసంఘాల కార్యాలయంలో రైతు కార్మిక సంఘాల సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ.. మోడీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా తీసుకువస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక చట్టాల కారణంగా వ్యవసాయరంగం దివాలా తీసే పరిస్థితి వస్తోందని అన్నారు. నల్లచట్టాలు, లేబర్ కోడ్‌లు కార్పొరేట్ల మెప్పు కోసమే కేంద్ర ప్రభుత్వం చూస్తోందని విమర్శించారు. ప్రజా సంఘాల నాయకులు జగదీశ్వర్ రెడ్డి, బక్కిరెడ్డి, ఈమని రామారావు, కె.రామకృష్ణ, సుందరరావు, గాంధీ, మేరి, జయలక్ష్మి, స్వర్ణకుమారి పాల్గొన్నారు.

తాడేపల్లి రూరల్: ఈనెల 20న జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ సంబంధిత సమ్మె నోటీసును టి.టి.టి యార్డు కాంట్రాక్టర్ మాధవరెడ్డికి సి.ఐ.టి.యు నాయకులు వేముల దుర్గారావు బుధవారం అందజేశారు. కార్మిక హక్కుల పరిరక్షణ కోసం 20న నిర్వహించే సమ్మెలో భాగంగా టి.టి.టి యార్డులో పనిచేస్తున్న 200 మంది కార్మికులు సమ్మెలో పాల్గొంటారని, ఆ రోజు పనిలోకి రారని కాంట్రాక్టర్ మాధవరెడ్డికి సమ్మె నోటీసును అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కె.బాబూరావు, ముఠామేస్త్రి శ్రీనివాసరావు, ఎ.ఐ.టి.యు.సి నాయకులు టి.వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

మేడికొండూరు: ఈనెల 20న జరిగే సమ్మెను జయప్రదం చేయాలని కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ అన్నారు. మేడికొండూరు మండల సీఐటీయూ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం సమ్మె జయప్రదం చేయాలని కోరుతూ ధనలక్ష్మి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బి.లక్ష్మణరావు మాట్లాడుతూ కార్మికులు సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దుచేసిందని అన్నారు. కార్మిక చట్టాల వ్యతిరేక విధానాలకు పంచాయతీ వర్కర్స్, ఆశాలు, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన కార్మికులు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కౌలు రైతు సంఘం నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

తాడేపల్లి రూరల్: ఈనెల 20న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ తాడేపల్లి మండల నాయకులు పల్లె కృష్ణ పిలుపునిచ్చారు. బుధవారం తాడేపల్లి రూరల్ పరిధిలోని కుంచనపల్లి జాతీయ రహదారి వెంబడి విస్తృత ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులతో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరారు. కనీస వేతన చట్టం ప్రకారం కార్మికులకు నెలకు రూ.26 వేలు ఇవ్వాలని.. 8 గంటల పని విధానాన్ని అమలు చేయాలని కోరుతూ సార్వత్రిక సమ్మెను నిర్వహించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులు జోజిబాబు, కృష్ణ తులసి, ప్రసాద్, వెంకటేశ్వరమ్మ, చిన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

మండల కమిటీ, గ్రామపార్టీ అధ్యక్షుల నియామకం



తాడికొండ: తాడికొండ నియోజకవర్గంలో మండల కమిటీలు, గ్రామపార్టీ అధ్యక్షుల జాబితాను వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం బుధవారం విడుదల చేసింది. తాడికొండ మండల పార్టీ అధ్యక్షుడిగా ముప్పాళ్ల మనోహర్, ఉపాధ్యక్షులుగా నల్లిబోయిన శ్రీనివాసరావు, బోళ్ల గణేష్ రెడ్డి, జనరల్ సెక్రటరీలుగా షేక్ ఖాజావలి, పత్తిపాటి సురేష్, సంకూరి జయపాల్, సెక్రటరీలుగా బలుసుపాటి వీరేంద్ర కుమార్, రావూరి నరేష్ కుక్కల శ్రీను, పులి రమేష్, చెన్నవరపు వీరాస్వామి, ఇసుకపల్లి రమేష్‌లను నియమించారు. తుళ్లూరు మండల పార్టీ అధ్యక్షుడిగా మైనేని నాగమల్లేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా కొయ్యగూర వినోద్, కలపాల ప్రభుదాస్, జనరల్ సెక్రటరీలుగా వల్లభాపురం నాగేశ్వరరావు, మేడిద శ్రీహరి, మేరుగుమాల నాగరాజు, సెక్రటరీలుగా దమ్మాటి ఫణీంద్ర కుమార్, కావురి విజయ్, చలివేంద్రం కార్తీక్, మేకల రాంబాబు, తోకల స్టాలిన్, పెరికల పాములు, సందుల పుల్లయ్య నియమితులయ్యారు. మేడికొండూరు మండల పార్టీ అధ్యక్షులుగా తాళ్లూరి వంశీకృష్ణ, ఉపాధ్యక్షులుగా రావిపాటి విజయ చంద్రరావు, ఉడతా ప్రభాకరరావు, జనరల్ సెక్రటరీలుగా కాసు రాయపరెడ్డి, నోసిన రామకోటేశ్వరరావు, పల్లెపోగు నరేష్(బుజ్జి), షేక్ మహబూబ్ సుభానీ, సెక్రటరీలుగా కాసిమల్ల ప్రదీప్, బోడపాటి శ్రీనివాసరావు, షేక్ మహమ్మద్ జానీ, మల్లిపెద్ది లక్ష్మీనారాయణ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌లుగా నేలపాటి బాలు, బుర్రి సాంబశివరావు, షేక్ ఇంతియాజ్, తాటిగిరి కోటేశ్వరరావు, షేక్ మస్తాన్, మద్దినేని జగదీష్, దండా కోటిరెడ్డి, కుందూరు శాంతి శేఖర్ రెడ్డి, షేక్ ముజీర్, బొండ్డు సాంబశివరావు, దేవతోటి శ్రీనివాసరావు, షేక్ బాజీలను నియమించారు. ఫిరంగిపురం మండల పార్టీ అధ్యక్షులుగా మార్పుల శివరామిరెడ్డి, ఉపాధ్యక్షులుగా గేరా కోటేశ్వరరావు, పోలిశెట్టి చిన్నయ్య, జనరల్ సెక్రటరీలుగా మోరంరెడ్డి శ్రీనివాసరెడ్డి, స్వర్ణచిన్నప్ప, మస్తాన్ రెడ్డి, మర్రి పుల్లారావు, షేక్ ఖాజావలి, సెక్రటరీలుగా షేక్ గౌస్, వడ్లమాను కృష్ణ, పొట్టపల్లి కోటిరెడ్డి, నేలపాటి దాసు, ఖతీబ్ మౌలాలీలను నియమించారు.

నియోజకవర్గంలో గ్రామపార్టీ అధ్యక్షులుగా..

తాడికొండ గ్రామపార్టీ అధ్యక్షుడిగా వంగా పోలారెడ్డి, లాం షేక్ సలీమ్, కంతేరు బొమ్మారెడ్డి అశోక్ రెడ్డి, నిడుముక్కల బందెల సుమన్, మోతడక నిమ్మగడ్డ రాజేంద్ర ప్రసాద్, లచ్చన్నగుడిపూడి షేక్ బాజీ, ముక్కామల దామనబోయిన యువరాజు, బేజాత్పురం వడ్లమూడి రాజేంద్ర ప్రసాద్, పాములపాడు బిక్కి శివరామకృష్ణ, రావెల భవనం చిన సాంబిరెడ్డి, పొన్నెకల్లు దొంతిరెడ్డి సీతారామిరెడ్డి, దామరపల్లి ఖాజా సాంబిరెడ్డి, ఫణిదరం నక్కా రత్తయ్య, గరికపాడు దాసరి చెన్నకేశవులు, బండారుపల్లి మదిర అచ్చయ్యలు నియమించారు. తుళ్లూరు గ్రామపార్టీ అధ్యక్షులుగా కంతేటి చిన వెంకటేశ్వర్లు, మందడం ఆలూరి శ్రీనివాసరావు, మల్కాపురం పాస్నం సురేష్, వెలగపూడి అబ్బూరి వెంకటేశ్వరరావు(పెద్దోడు), లింగాయపాలెం కొండెపాటి సుబ్బారావు, రాయపూడి షేక్ జానీ భాషా, అబ్బరాజుపాలెం బండి జోషి, వెంకటపాలెం బెజ్జం ప్రకాశరావు, బోరుపాలెం చనుమోలు రామారావు, హరిశ్చంద్రపురం సంకా హరిబాబు ఉద్దండరాయునిపాలెం పులి మాణిక్యరావు, దొండపాడు కాకుమాను బ్రహ్మయ్య, నెక్కల్లు గుమ్మా శ్రీనివాసరావు, పెదపరిమి కన్నెధార ఉమామహేశ్వరరావు, నేలపాడు ఇందుర్తి అప్పారావు, ఐనవోలు పాలకాయల శేషగిరిరావు, అనంతవరం సుంకర శ్రీనివాసరావు, శాఖమూరు తుమ్మూరు వరప్రసాద్ రెడ్డి, వడ్డమాను గొట్టం వెంకట నరసింహారెడ్డిలను నియమించారు. పేరేచర్ల గ్రామపార్టీ అధ్యక్షుడిగా షేక్ మహబూబ్ సుభానీ, మేడికొండూరు కొరివి చెన్నయ్య సిరిపురం కంకణాల పరమేశ్వరరావు, పాలడుగు పేరం సాయి, కొర్రపాడు కొల్లికొండ నరసింహారావు, జంగంగుంట్లపాలెం ఆళ్ల ఉమా మహేశ్వరరెడ్డి, భీమినేని వారిపాలెం ఆలూరి శ్రీనివాసరావు, మంగళగిరిపాడు షేక్ ఫారిద్ మోహిద్దీన్, డోకిపర్రు షేక్ అబ్దుల్ కలామ్, విశదల మర్రి సుబ్బారావు, గుండ్లపాలెం దొప్పలపూడి దయాకర్, మందపాడు దండా సూర్యనారాయణ రెడ్డి, యలవర్తిపాడు షేక్ సుభానీ, వరగాని భవనం రాజశేఖర్ రెడ్డిలను నియమించారు. ఫిరంగిపురం గ్రామపార్టీ అధ్యక్షుడిగా కొమ్మారెడ్డి చిన్నప్పరెడ్డి, గొల్లపాలెం జొన్నలగడ్డ ఆనంద్, రేపూడి చిట్టా శ్రీనివాసరెడ్డి, వేములూరిపాడు దండా వెంకట్రావు, అమీనాబాద్ షేక్ పీర్ల ఇస్మాయిల్, నుదురుపాడు దొడ్డా పిచ్చిరెడ్డి, కండ్రిక తుపాకుల పుల్లారావు, మేరికపూడి దేవరపల్లి బ్రహ్మారెడ్డి, పొనుగుపాడు మేళం జోజిబాబు, మునగపాడు షేక్ జిలానీ, వేమవరం మండల శ్రీనివాసరెడ్డి, హౌస్‌గణేష్‌పాడు కె సరోజినీ జోసఫ్, గుండాలపాడు గోదా రాజేష్, బేతపూడి షేక్ షరీఫ్, యర్రగుండ్లపాడు చల్లా వెంకట రెడ్డి, 113 తాళ్లూరు ఒంటేరు వెంకట్రావు, సిరంగిపాలెం దాసరి యెహోషువా, తక్కెళ్లపాడు ఇందుర్తి శ్రీనివాసరెడ్డిలను నియమించారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్సవం

యర్రబాలెం(మంగళగిరి): మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని యర్రబాలెంలో కొలువైన శ్రీ భక్తాంజనేయ స్వామివారి విగ్రహ, జీవ, ధ్వజ, విమాన శిఖర ప్రతిష్టా మహోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 7 గంటలకు విశ్వక్సేరాధనం, పుణ్యావాహం, ప్రాతస్సవనం, అధివాసాంగ హోమం, కుంభాబి మర్శనం, ఉక్త హోమాదులు, నివేదన, హారతి పూజలు, సాయం సవనం, కుంభాబి మర్శనం, మూలమస్త హోమాదులు, సర్వ దైవత్య హోమం, మహర్షి వేదన హారతి పూజలు నిర్వహించారు. పూజలు అనంతరం అన్నప్రసాదం వితరణ చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అలయ కమిటీ ప్రతినిధులు భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు.



ప్రత్యేక అలంకరణలో శ్రీభక్తాంజనేయ స్వామి

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలి



తాడికొండ: వేసవిలో ఎండలు అధికంగా ఉన్న నేపథ్యంలో వడదెబ్బ తగలకుండా కూలీలు జాగ్రత్తలు పాటించాలని గుంటూరు మెడికల్ కళాశాల వైద్య విద్యార్థులు సూచించారు. మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.సుందరాచారి ఆదేశాల మేరకు తాడికొండ మండలం లాం గ్రామంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎక్కువ ఎండ ఉన్న సమయంలో పని తగ్గించుకొని చల్లగా ఉండే సమయాల్లో పనిచేయాలన్నారు. వీలైతే ఓఆర్ఎస్ నీటిని తీసుకోవడం ద్వారా నీరసం తగ్గించుకోవచ్చన్నారు. అత్యవసరం అయితే 108కి కాల్ చేసి సమీప వైద్య సాయం పొందాలన్నారు. వడదెబ్బ లక్షణాలు కనిపించిన వెంటనే ఆశా, ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీలను సంప్రదించా లని పొన్నెకల్లు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ భార్గవ్ కోరారు. ఏపీడీ పద్మావతి, గుంటూరు మెడికల్ కళాశాల ఇంటర్న్, అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు పాల్గొన్నారు.

పసుపు లోడు లారీ బోల్తా

దుగ్గిరాల: పసుపు లోడుతో వెళుతున్న లారీ, ఎదురుగా ఉన్న వాహనాన్ని తప్పించబోయి రహదారి పక్కన ఉన్న కాలువలో బోల్తా పడింది. ఈ సంఘటన దుగ్గిరాలలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. ప్రమాదవశాత్తు లారీ బోల్తా పడగా గమనించిన స్థానికులు డ్రైవర్‌ను కాపాడారు.

ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలని వినతి



ఇంటర్మీడియట్ విద్యామండలి కమిషనర్ కృత్తిక శుక్లాకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

తాడేపల్లి రూరల్: ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలని కోరుతూ తాడేపల్లిలోని ఇంటర్మీడియట్ విద్యామండలి కమిషనర్ కృత్తిక శుక్లాకు ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.భాస్కర్, సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్‌లు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేటు విద్యాసంస్థల్లో విచ్చలవిడిగా ధనమే ధ్యేయంగా ఫీజుల దోపిడి జరుగుతుందని అన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా క్యాంపస్ ఒక జిల్లాలో ఉంటే రాష్ట్ర వ్యాప్తంగా పీఆర్‌ఓలతో అడ్మిషన్లు చేస్తూ కార్పొరేట్ విద్యాసంస్థలు మాయమాటలతో చట్టవిరుద్ధంగా అడ్మిషన్లు చేస్తున్నారని విమర్శించారు. కమర్షియల్ బిల్డింగ్‌లో తరగతులను నిర్వహిస్తూ.. విద్యను వ్యాపారంగా మారుస్తున్నారని, కళాశాల ఆవరణలోనే పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌లు అంటూ వేలాది రూపాయలు దోపిడీ చేస్తున్నారని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు లేని కళాశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు మహర్షి, సహాయ కార్యదర్శులు ఐ.రాజేష్, వీరేంద్ర ప్రసాద్, సభ్యులు ధీరజ్, శివ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత ప్రవర్తనతోనే మంచి గుర్తింపు



పోతురాజు, శ్రీనివాసరావులను సత్కరిస్తున్న అధికారులు

తాడికొండ: ప్రతి ఒక్కరికీ వ్యక్తిగత ప్రవర్తన సక్రమంగా ఉంటే విధుల్లో అదే మంచి గుర్తింపును తెచ్చిపెడుతుందని తాడికొండ సీఐలు కె.వాసు, సత్యన్నారాయణలు అన్నారు. బుధవారం తాడికొండ స్టేషన్‌లో విధుల నుంచి బదిలీపై వెళుతున్న హెడ్ కానిస్టేబుల్ పోతురాజు, కానిస్టేబుల్ శ్రీనివాసరావులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తాడికొండ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ అందరి మన్ననలు పొందిన వీరిద్దరూ పోస్టింగ్‌లపై కీలకమైన ఈగల్ సెల్, ఎస్‌బీ విభాగాలకు బదిలీ కావడం హర్షణీయమన్నారు. ఆయా విభాగాల్లో పనిచేయాలంటే మంచి పట్టు ఉన్న వ్యక్తులు కావాలని.. బదిలీపై వెళుతున్న వీరిద్దరికీ ఆ సమర్థత ఉన్నందునే ఉన్నతాధికారులు అవకాశం కల్పించారన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు జోజి, జీత్యా నాయక్, పలువురు కానిస్టేబుళ్లు, సిబ్బంది పాల్గొన్నారు.

బస్టాండ్‌లో సౌకర్యాలను వినియోగించుకోండి

మంగళగిరి టౌన్: మంగళగిరి బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన సౌకర్యాలను ప్రయాణికులు వినియోగించుకోవాలని మంగళగిరి ఆర్టీసీ డిపో ఇన్‌చార్జి మేనేజర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేసవి దృష్ట్యా ప్రయాణికులకు ఆర్‌వో ప్లాంట్ ఏర్పాటు చేశామని అన్నారు. వారు కూర్చునేందుకు 108 కుర్చీలు, 10 ఫ్యాన్లు ఉన్నాయని, బస్సుల రాకపోకల సమాచారం ప్రయాణికులకు తెలిసేలా పట్టిక ఏర్పాటు చేశామని అన్నారు. పరిశుభ్రమైన మరుగుదొడ్లను అందుబాటులో ఉంచామని.. చంటి పిల్లలకు పాలు ఇచ్చేందుకు ప్రత్యేక గదిని ఏర్పాటు చేశామని ఆ ప్రకటనలో పేర్కొన్నార

కొనసాగుతున్న ఆర్టీసీ కార్మికుల సమ్మె

మంగళగిరి: మంగళగిరి ఆర్టీసీ డిపో ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి బి.నాగేశ్వరరావును చట్టవిరుద్ధంగా సస్పెండ్ చేయడంపై యూనియన్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్టీసీ యాజమాన్యం నాగేశ్వరరావును వెంటనే తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన సస్పెండ్‌ను నిరసిస్తూ బుధవారం ఆర్టీసీ డిపో వద్ద కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ.. నాగేశ్వరరావును యాజమాన్యం చట్టవిరుద్ధంగా సస్పెండ్ చేసి కక్ష్య పూరితంగా వ్యవహిస్తుందన్నారు. ఎర్ర బ్యాడ్జీలు ధరించి విధులు నిర్వహించారు. యాజమాన్యం చొరవ చూపి సమస్యను పరిష్కరించాలని కోరారు. లేదంటే ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు స్వామి, రత్నాకర్, సాంబశివరావు, చిన్ని సత్యనారాయణ, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లతో సమావేశం



మాట్లాడుతున్న లక్ష్మణరావు

ఫిరంగిపురం: చిన్నపాటి కారణాలు చూపి ఆటోడ్రైవర్లను బాధ్యులుగా చేసి వేలాది రూపాయలు ఫెనాల్టీలు విధంచడం, ఏళ్లతరబడి జైలు శిక్షలు వేయడం కక్ష్య పూరిత చర్యలేనని ఆలిండియా రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్, జిల్లా ఆటో డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షుడు లక్ష్మణరావు అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఆటోడ్రైవర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. జాతీయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 20న నిర్వహించే సమ్మెలో భాగంగా ఆటోల బందును జయప్రదం చేయాలన్నారు. దేశంలో ఉన్న రవాణారంగ కార్మికులపై కేంద్ర ప్రభుత్వం భారాలు మోపుతుందన్నారు. కార్యక్రమంలో మస్తాన్‌వలి, యూనియన్ నాయకులు భాస్కర్, వెంకటేశ్వరరావు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

రిటైర్డ్ డీఎస్పీ బొప్పన మృతి



మంగళగిరి టౌన్: మంగళగిరి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో గతంలో సబ్ ఇన్‌స్పెక్టర్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించిన రిటైర్డ్ డీఎస్పీ బొప్పన విజయకుమార్(75) బుధవారం అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి చెందారు. వృత్తిరీత్యా పోలీస్‌అధికారిగా ఉన్నత పదవులు అలంకరించి నిజాయితీ, నిబద్ధత కలిగిన విజయకుమార్ చిన్నతనం నుంచే అభ్యుదయ వాదిగా ఉండేవారని పలువురు వామపక్ష పార్టీ, ప్రజా సంఘాల నాయకులు పేర్కొన్నారు. నార్త్ సబ్ డివిజన్ పరిధిలోని పలువురు పోలీస్‌అధికారులు మంగళగిరి పట్టణ పరిధిలోని ఇప్పటం రోడ్‌లోని ఆయన నివాసానికి చేరుకుని బొప్పన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు.